క్లుప్తంగా

ప్రయాణికులను వణికిస్తున్న గొయ్యి



రోడ్డు మధ్యలో ప్రమాదకరమైన గొయ్యి

దేవరపల్లి: గుండుగొలను-కొవ్వూరు రాష్ట్ర ప్రధాన రహదారిపై దేవరపల్లి-దుద్దుకూరు గ్రామాల మధ్య గల పెట్రోలు బంకు వద్ద ఉన్న గొయ్యి ప్రయాణికులను వణికిస్తోంది. రాత్రి సమయంలో బైక్‌లపై వెళుతున్న ప్రయాణికులు గొయ్యిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. దాదాపు ఏడాది నుంచి గొయ్యి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. గొయ్యి చిన్నదైనప్పటికీ పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా గొయ్యిని శాశ్వతంగా పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎల్ బండ్‌లు నిర్మించుకోండి



పెరవలిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మజ

పెరవలి: ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో రైతులు ఎల్ బండ్‌లు నిర్మించుకుంటే అందుకు అయ్యే ఖర్చు రూ.58 వేలు ప్రభుత్వం అందిస్తుందని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె పద్మజ తెలిపారు. పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ మేట్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరవలి మండలంలో ఇప్పటి వరకు 10 ఎకరాల్లో వీటిని ఏర్పాటు చేయటానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని తెలిపారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ సత్యనారాయణ మాట్లాడుతూ ఎల్ బండ్‌ల వల్ల ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

గోపాలపురం: గోపాలపురం సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ సత్యసాయి ఇండస్ట్రీయల్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకూ విద్యుత్ నిలుపుదల చేస్తామని నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ నారాయణ అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలపురం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం సాయంత్రం 4 నుంచి 5గంటల వరకూ విద్యుత్ నిలుపుదల చేస్తామన్నారు.

బీమా చెక్కు అందజేత

తాళ్లపూడి: యూనియన్ బ్యాంక్‌లో పొదుపు ఖాతా తీసుకున్న ప్రతి ఒక్కరూ బీమా పాలసీ తీసుకోవడం వల్ల ఆ కుటుంబానికి బీమా సొమ్ము లభిస్తుందని తాళ్లపూడి శాఖ మేనేజర్ నాగరాజు బుధవారం తెలిపారు. వేగేశ్వరపురానికి చెందిన బ్యాంక్ ఖాతాదారు శీర్ల గన్నెమ్మ ఇటీవల మరణించారు. యూనియన్ బ్యాంక్‌లో పొదుపు ఖాతా ద్వారా ఆమె బీమా పాలసీ తీసుకోవడం వల్ల రూ.లక్ష బీమా సొమ్ము మంజూరైంది. ఆమె భర్త శీర్ల నాగేశ్వరరావుకు బీమా సొమ్మును అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం కాదు

తాళ్లపూడి: అన్నదేవరపేటలో తరుణి ఇండస్ట్రీలోని గోడౌన్ స్టాక్ ఏరియాలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రకటించటం వాస్తవం కాదని తాళ్లపూడి మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఘటన జరిగిన వెంటనే లైన్ ఇన్‌స్పెక్టర్, ఇతర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అన్నదేవరపేట తరుణి పరిశ్రమలు గోడౌన్‌ను పరిశీలించామని తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ వైపు నుంచి ఎటువంటి లోపం లేదని తెలిపారు. పరిశ్రమ గోడౌన్ అంతర్గత లోపం వల్ల మాత్రమే విద్యుత్ ప్రమాదం జరిగిందని ఏఈ పేర్కొన్నారు.

30 లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో ఈ-కేవైసీ చేయించుకోని రైస్‌కార్డు లబ్ధిదారులు ఈనెల 30వ తేదీలోపు చేయించుకోవాలని సివిల్ సప్లయిస్ రూరల్ డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకరరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం రైస్‌కార్డులో ఉన్న ప్రతి లబ్ధిదారుడు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే స్మార్ట్ కార్డుల్లో ఈ-కేవైసీ చేయించుకోని కార్డులు రావన్నారు. కొందరు పిల్లల ఆధార్ అప్‌డేట్ చేయకపోవడంతో ఈ-కేవైసీ కావడం లేదన్నారు. వారందరూ సమీపంలోని ఆధార్ సెంటర్‌లో చేయించుకోవాలన్నారు. రేషన్‌షాపుల్లోని ఈపీవోఎస్, గ్రామ సచివాలయం సిబ్బంది వద్ద గల మొబైల్‌యాప్ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవచ్చన్నారు. మన మిత్ర వాట్సాప్ నంబర్ 95523 00009 ద్వారా మీ ఫోన్‌లోనే ఈ-కేవైసీ స్థితి తెలుసుకోవచ్చన్నారు.



మల్లేశ్వరంలో రోడ్డు పక్కన చెత్తకుప్పలు



ఖండవల్లిలో రోడ్డు పక్కన ఇళ్లను పడగొట్టిన మెటీరియల్



అన్నవరప్పాడులో మురుగునీటి ప్రవాహంతో సీసీ రోడ్డుకు చిల్లులు

రహదారి.. దుర్గంధభరితం

- పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- అధ్వానంగా వడలి-ముక్కామల ఆర్అండ్‌బీ రహదారి
- రూ.24 కోట్లతో 11 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం
- 18 నెలలకే అస్తవ్యస్తం
- చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనచోదకులు

పెరవలి: మండలం పరిధిలోని వడలి-ముక్కామల ఆర్అండ్‌బీ రహదారి నిర్మించి 20 నెలలు గడవక ముందే అవసాన దశకు చేరుతోంది. గృహవాసుల అవగాహన లోపం, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు అధ్వానంగా మారుతోంది. ఈ మార్గంలో గ్రామాల్లోకి అడుగుపెట్టకముందే రోడ్డు పక్కన చెత్తకుప్పలు దుర్గంధం వెదజల్లుతూ దర్శనమిస్తుండగా, ఊరి ప్రారంభంలోనే చెత్తకుప్పలతో పాటు కోళ్లు, చేపల వ్యర్థాలు కనిపిస్తున్నాయి. ఇక గ్రామంలోకి వెళితే రోడ్డుపై మురుగునీరు పారుతోంది. వీటిపై గ్రామస్తులు ఫిర్యాదులు చేసినా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

10 గ్రామాలను కలుపుతూ రోడ్డు నిర్మాణం

ఈ ఆర్అండ్‌బీ రహదారి వడలి నుంచి ముక్కామల వరకు సుమారు 11 కిలోమీటర్ల మేర ఉండగా దీని పరిధిలో 10 గ్రామాలున్నాయి. పిట్టల వేమవరం, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, ఖండవల్లి, లంకమాలపల్లి, ముత్యాలవారిపాలెం, ముక్కామల, ఉమ్మిడివారిపాలెం, ఓదూరువారిపాలెం, బొక్కావారిపాలెం ప్రజలు నిత్యం ఈ రోడ్డుమీదుగానే రాకపోకలు సాగిస్తారు. రోడ్డుపై మురుగునీరు ప్రవహించి చోట వాహన చోదకులు, పాదచారులు ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.



అన్నవరప్పాడులో ఆర్అండ్‌బీ రోడ్డుపై పారుతున్న మురుగునీరు

ప్రమాదాలకు నిలయంగా రహదారి

నూతనంగా ఇళ్లు నిర్మించుకునే వారు ఇసుక, కంకర గుట్టలు ఈ రోడ్డుపైనే వేయడంతో సగభాగం మూసుకుపోయి జాగ్రత్తలు పాటించినా ద్విచక్ర వాహనదారులు జారిపడి గాయాలపాలవుతున్నారు. ఖండవల్లి వద్ద ఈ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఐదుగురు క్షతగాత్రుల అయ్యారు. దీనితో ఖండవల్లి పంచాయతీ మేల్కొని గ్రామం పరిధిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అన్నవరప్పాడులో రహదారిలో గృహవాసులు మురుగునీరు రోడ్డుపై వదలి వేస్తున్నా అధికారులెవరూ కనీసం కన్నెత్తి చూడటం లేదు. దీనితో గృహవాసులు ఎక్కడికక్కడ రోడ్డుకి అడ్డంగా మురుగు నీరు రాకుండా అడ్డుకట్టలు వేసారు. దీనిపై మండల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాల్లేవు.

చెత్త రోడ్డుగా వడలి-ముక్కామల రోడ్డు

గ్రామస్తుల సౌకర్యార్థం రూ.24 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్డుగా, గ్రామం వెలుపల తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు. సీసీ రోడ్లు నిర్మించి కేవలం 18 నెలలు మాత్రమే అవుతుండగా ఎక్కడికక్కడ చిల్లులు పడి అధ్వానంగా తయారయ్యాయి. 22 అడుగుల వెడల్పుతో నిర్మించిన ఈ రహదారి పేరుకుపోయిన చెత్తకుప్పల కారణంగా నేడు 15 అడుగులకు కుచించుకుపోయింది.

అధికారులు పట్టించుకోలేదు



ఈ రహదారి పొడవునా చెత్తకుప్పలు, గ్రామాల్లో ఇసుక, కంకర గుట్టలు ఉన్నాయి. ఇప్పటికే మా గ్రామంలో ఒకరు ఈ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో మృతి చెందగా, ఇద్దరు గాయాల పాలయ్యారు.ఫిర్యాదు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు.

– ఈతకోట నాగరాజు, లంకమాలపల్లి

పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలు



రోడ్డుపై మురుగునీరు వదలివేస్తున్నారు. రోడ్డు పక్కన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తున్నారని తెలిసింది. దీనిపై స్పందించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోమని పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలిచ్చాను. చర్యలు తీసుకోని సెక్రటరీలకు నోటీసులు జారీ చేస్తాను.

– సీహెచ్ వెంకటరమణ, ఈఓపీఆర్డీ, పెరవలి

నేడు మండల పరిషత్ సమావేశం

ఉండ్రాజవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అధ్యక్షతన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఉండ్రాజవరం ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు పెరవలి మండలంలో..

పెరవలి: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షత నిర్వహించనున్నట్లు పెరవలి ఎంపీడీఓ కె పద్మజ తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, పూర్తి సమాచారంతో రావాలని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

చాగల్లులో..

చాగల్లు: స్థానిక మండల పరిషత్ కార్యలయంలో గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు చాగల్లు ఎంపీడీవో ఎ.శ్రీదేవి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించే ఈ సభకు అధికారులు, సభ్యులు హాజరు కావాలని ఆమె తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నిడదవోలు: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలో తన క్యాంపు కార్యాలయంలో బుధవారం వివిధ కారణాలతో అనారోగ్యం బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందిన, పొందుతున్న 32 మంది పేదలకు రూ.20 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీ పత్రాలను ఆయన పంపిణీ చేశారు. నిడదవోలు పట్టణంతో పాటు, రూరల్, ఉండ్రాజవరం,పెరవలి మండలాల్లోని పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించామన్నారు. కోరుమామిడికి చెందిన పసలపూడి నాగచంద్రం అనే చిన్నారి వైద్య ఖర్చులకు ఎల్‌వోసీ ద్వారా రూ.4 లక్షలు మంజూరైనట్టు మంత్రి తెలిపారు.

ఎట్టకేలకు మంచినీరు సరఫరా

- 20 ఏళ్లుగా ప్రజల నిరీక్షణ
- వైఎస్సార్ సీపీ హయాంలో నిధులు మంజూరు
- 30 లక్షల వ్యయంతో పైపులైన్ ఏర్పాటు

దేవరపల్లి: ఎట్టకేలకు వారి మంచినీటి కష్టాలు తీరాయి. దాదాపు 20 ఏళ్లుగా దేవరపల్లిలోని చంద్రబాబు నాయుడు(సీబీఎన్) కాలనీవాసులు మంచినీటి కోసం అవస్థలు పడుతున్నారు. కాలనీ ఏర్పడి దాదాపు 20 ఏళ్లు కావస్తోంది. సుమారు 300 కుటుంబాలు పక్కా గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటున్నాయి. కాలనీకి సమీపంలో గల జెడ్పీ హైస్కూలు వద్ద గల బోరు నుంచి కొంతకాలం నీరు సరఫరా చేశారు. నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండడంతో ప్రజలు అనారోగ్యాలకు గురయ్యేవారు. దీంతో సుమారు ఆరేళ్ల క్రితం కాలనీలో కొత్తగా బోరు వేసి మోటారు ఏర్పాటు చేసి 40 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. కొత్త బోరు ద్వారా మంచి నీరు వస్తుందని ప్రజలు ఆశించారు. అయితే బోరు నీటిలో సుద్ద ఎక్కువగా ఉండడంతో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. 2009-10 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి తానేటి వనిత కాలనీలో మంచినీటి సరఫరాకు సుమారు రూ. 2 లక్షల వ్యయంతో 20 వేల లీటర్ల మినీ వాటర్ ట్యాంకు నిర్మాణం చేశారు. ట్యాంకుకు బుచ్చియపాలెం రోడ్డులోని బోరు నుంచి పైపులైన్ నిర్మాణం చేసి కొద్ది రోజులు మంచినీరు సరఫరా చేశారు. నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో కాలనీకి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో గల యాదవోలు రోడ్డులో గల మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి నిత్యం ప్రజలు టిన్నుల ద్వారా మంచినీరు తెచ్చుకుని తాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. ప్రజల ఇబ్బందులను గమనించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2022-23 సంవత్సరంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.30 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో యాదవోలు రోడ్డులోని ట్యాంకు నుంచి కాలనీలోని ఓవర్ హెడ్ ట్యాంకు వరకు పైపులైన్ నిర్మాణం చేశారు. 2024 డిసెంబర్‌లో యాదవోలు రోడ్డులో బోరు నిర్మాణం చేపట్టారు. బోరకు మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలు ఎంపీపీ కేవీకే దుర్గారావు మంజూరు చేశారు. మోటారు, విద్యుత్ సర్వీసు, షెడ్డు నిర్మాణానికి మరొక రూ.5 లక్షలు మంజూరు చేశారు. దాదాపు రూ.15 లక్షల వ్యయంతో కాలనీకి మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. పనులు పూర్తికావడంతో బుధవారం కాలనీకి మంచినీరు సరఫరా ప్రారంభించారు. మంచినీరు సరఫరా చేయడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాలనీతో పాటు బాలదుర్గమ్మ ప్రాంతం, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియాకు మంచినీరు సరఫరా జరుగుతుందని అధికారులు తెలిపారు.



దేవరపల్లిలోని సీబీఎన్ కాలనీ



మంచినీటి సరఫరాకు వేసిన బోరు నీటిని పరిశీలిస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు (ఫైల్)

నిరుపయోగంగా మరుగుదొడ్లు

- ధ్వంసం చేసిన ఆకతాయిలు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

దేవరపల్లి: ప్రయాణికుల సౌకర్యార్థం గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)లో సర్వీసు రోడ్లుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన టాయ్‌లెట్ బ్లాక్ (మరుగుదొడ్లు)లు నిరుపయోగంగా ఉన్నాయి. సర్వీసు రోడ్లలో బస్టాప్‌ల వద్ద, వాహనాల రెస్ట్ ఏరియాల వద్ద టాయ్‌లెట్స్ బ్లాక్‌లను స్త్రీలు, పురుషులకు విడిడిగా నిర్మించారు. ఒక్కొక్క బ్లాక్ సుమారు రూ. 2 లక్షల వ్యయంతో మూడేళ్ల క్రితం నిర్మాణం చేశారు. రన్నింగ్ వాటర్, విద్యుత్ సదుపాయంతో పాటు ఆధునిక సౌకర్యాలతో బ్లాక్‌ల నిర్మాణం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో మరుగుగొడ్లు ప్రయాణికులకు ఉపయోగపడేవి. అయితే రాత్రి సమయంలో ఆకతాయిలు వీటిని ధ్వంసం చేయడంతో నిరుపయోగంగా ఉన్నాయి. మరుగుదొడ్లు లేక హైవేపై వెళుతున్న ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. గుండుగొలను-కొవ్వూరు మధ్య ఈ మరుగుదొడ్లను నిర్మాణం చేశారు. కొంత మంది వ్యక్తులు బ్లాక్‌లను రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్టు సమాచారం. ధ్వంసమైన బ్లాక్‌లను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకు రావాలని ప్రయాణికులు హైవే అధికారులను కోరుతున్నారు.



గౌరీపట్నం వద్ద హైవే సర్వీసు రోడ్డులో ఆకతాయిలు ధ్వంసం చేసిన టాయ్‌లెట్ బ్లాక్

ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తున్నాం



టాయిలెట్ బ్లాక్‌లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారు. సర్వీసు రోడ్డులోని ప్రతి బస్‌షెల్టర్ వద్ద టాయిలెట్ బ్లాక్‌లను నిర్మాణం చేశాం. బ్లాక్‌లన్నీ పూర్తిగా ధ్వంసమైనట్టు గుర్తించాం. ప్రతి బ్లాక్ వద్ద వాచ్‌మన్‌ను పెట్టి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. అక్కడక్కడా కొంత మంది వ్యక్తులపై పోలీస్ కేసులు పెట్టాం. ఆకతాయిలను పోలీసులు గుర్తించవలసి ఉంది.

– సురేంద్రనాథ్, పీడీ, నేషనల్ హైవే అథారిటీ, రాజమహేంద్రవరం

వాహన రాకపోకలకు దారి మళ్లింపు

నిడదవోలు : పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్వోబీ పనుల నిమిత్తం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజమండ్రి, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలను గురువారం నుంచి దారి మళ్లించినట్లు తహసీల్దారు నాగరాజునాయక్ బుధవారం తెలిపారు.

రాజమండ్రి నుంచి తాడేపల్లిగూడెం వైపు దారి మళ్లింపు ఇలా..

రాజమండ్రి నుంచి ఐ.పంగిడి, నల్లజర్ల, తాడేపల్లిగూడెం వైపునకు దారి మళ్లించారు. తాడేపల్లిగూడెం నుంచి రాజమండ్రి వెళ్లడానికి నల్లజర్ల, ఐ.పంగిడి, కొవ్వూరు మీదుగా రాజమండ్రి వెళ్లాల్సి ఉంది. మరో మార్గం ద్వారా రాజమండ్రి నుంచి కొవ్వూరు, విజ్జేశ్వరం, గోపవరం, డి.ముప్పవరం, కానూరు, తణుకు మీదుగా తాడేపల్లిగూడెం చేరుకోవచ్చు. తాడేపల్లిగూడెం నుంచి తణుకు, కానూరు, డి.ముప్పవరం, గోపవరం, విజ్జేశ్వరం, కొవ్వూరు మీదుగా రాజమండ్రి చేరుకోవచ్చు.

నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం వెళ్లడానికి మరో మార్గంలో దారి మళ్లించారు. నిడదవోలు నుంచి కోరుమామిడి, అప్పారావుపేట, తాడేపల్లిగూడెం వైపునకు దారి మళ్లించారు. తాడేపల్లిగూడెం నుంచి అప్పారావుపేట, కోరుమామిడి, నిడదవోలు చేరుకోవచ్చునని తహసీల్దారు నాగరాజునాయక్ పేర్కొన్నారు.

తాళ్లపూడి ఎంపీడీఓగా వేణుగోపాలరెడ్డి

తాళ్లపూడి: మండల ఎంపీడీఓగా వేణు గోపాలరెడ్డి నియమితులయ్యారు. ఆయన ఇప్పటి వరకు దేవరపల్లి మండలంలో పనిచేసి తాళ్లపూడి ఎంపీడీఓగా బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ టీబీ వెంకటరమణ కొవ్వూరు బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా తాళ్లపూడి ఎంపీడీఓగా నియమితులైన వేణు గోపాలరెడ్డి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజుని మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఆయన గతంలో ఇక్కడ పనిచేశారు.



తాళ్లపూడి ఎంపీడీఓ వేణుగోపాలరెడ్డిని అభినందిస్తున్న ఎంపీపీ పోసిరాజు

సారా రహిత గ్రామాలే లక్ష్యం

పెరవలి: సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దటమే ప్రభుత్వం లక్ష్యమని ఎక్సైజ్ సీఐ జైరామ్ సతీష్ బాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నవోదయ-2.0ను పెరవలిలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గంలో 11 గ్రామాల్లో సారా తయారీ చేసే వారు ఉండేవారని రెండేళ్లగా వారి పరివర్తనను పరిశీలిస్తున్నామని సీఐ తెలిపారు. పెరవలి మండలంలో కానూరు, నడుపల్లికోట, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు గ్రామాల్లో సారా కేసులు ఎక్కువగా నమోదయ్యేవని, ఈ గ్రామాల్లో గతంలో అరెస్టు అయిన వారు వివిధ రకాల వృత్తులకు మారారని తెలిపారు. రెండేళ్లుగా ఈ గ్రామాల్లో ఎవరూ అరెస్టు కాకపోవడంతో పెరవలి మండలాన్ని స్వచ్ఛ మండలంగా, సారా రహిత మండలంగా ఎంపిక చేశామని తెలిపారు.ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు సారా జోలికి వెళ్లవద్దని హితవు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మజ, ఎస్సై యం వెంకటేశ్వరరావు వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



పెరవలిలో ర్యాలీ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

అభివృద్ధి పనులను అడ్డుకోవడం తగదు

తాళ్లపూడి: గ్రామాల్లో టీడీపీ నాయకులు అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని, అంగన్‌వాడీ భవనాలు నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయని, ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వడం లేదని సర్వ సభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, అధికారుల వద్ద ఆరోపించారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సర్వ సభ్య సమావేశం ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి కొనసాగించారు. వివిధ శాఖల అధికాలతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా వ్యవసాయం, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, గృహనిర్మాణ, పంచాయతీ రాజ్, ఆరోగ్యం, రెవెన్యూ, వెలుగు, హార్టీకల్చర్, విద్యాశాఖ తదితర శాఖల పరిధిలోని పలు అంశాలను సమావేశంలో వివరించారు. ఏవో రుచిత మాట్లాడుతూ మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి 4,396 మంది రైతులు ఉన్నారని తెలిపారు. వీరందరి వివరాలు ఈకేవైసీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ దశలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు మాట్లాడుతూ వేగేశ్వరపురంలో గత ప్రభుత్వంలో మంజూరు అయిన మండల పరిషత్ నిదులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, ఇతర రోడ్డు పనులు చేయకుండా టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని అన్నారు. కాంట్రాక్టర్‌ను బెదిరించడంతో పనులు జరగడంలేదని సభలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గజ్జరం ఎంపీటీసీ గుంటు చిన్నబ్బాయి మాట్లాడుతూ ఎంపీటీలకు గౌరవ వేతనం ఇవ్వడం లేదని అన్నారు.వీటిపై ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులకు అడ్డుపడితే సహించేది లేదన్నారు. అందరూ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు మాట్లాడుతూ 15 ఆర్థిక సంఘం నిధులు ఇంకా విడుదల కాలేదని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాజగోపాల్‌రెడ్డితో పాటు ఇప్పటి వరకు పనిచేసిన ఎంపీడీవో టీబీ వెంకటరమణ, ఈవోపీఆర్డీ కే ఎస్ వీరన్న, ఆయా శాఖల మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు

కంబాలచెరువు: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థలు నూతన అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేసుకున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రైవేటు విద్యాసంస్థలు విద్యా వ్యాపారానికి పాల్పడుతున్నాయన్నారు. పేదల నుంచి అధిక మొత్తంలో డొనేషన్ల పేరుతో ఫీజులు గుంజుతున్నాయన్నారు. అరకొర వసతులతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మేల్కొని విద్యాహక్కు చట్టం ప్రకారం నడుచుకోని ప్రైవేటు విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ, ఉపాధ్యక్షులు భానుప్రసాద్, రూప శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధూ, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

ఆశ్రమ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ: వృద్ధులకు, అనాథలకు ఉచితంగా భోజనం, వసతి ఆశ్రయం కల్పిస్తామని చెప్పి అమ్మనాన్న వృద్ధాశ్రమం నిర్వాహకులు డబ్బు, బంగారం వసూలు చేస్తున్నారని చిట్యాలకు చెందిన గద్దె వెంకట కృష్ణారావు ఆరోపించారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ కృష్ణారావు తన ఇల్లు అమ్మిగా వచ్చిన కొద్ది మొత్తంతో అమ్మనాన్న వృద్ధాశ్రమంలో చేరారు. తనకు వచ్చే నెల పెన్షన్‌ను నిర్వాహకులకు ఇచ్చేవారు. వృద్ధాశ్రమం నిర్వాహకులు పడగల ప్రసాద్ యాదవ్, అతడి కుమారుడు చైతన్య, అనుచరుడు బొల్లిన కృష్ణ మిగతా వృద్ధులు, మహిళల వద్ద నగదు, బంగారు ఆభరణాలు భద్రపరుస్తామని తీసుకునే వారన్నారు. కృష్ణారావు తన వద్ద ఉన్న 2.50 లక్షల్లో ఒక లక్ష రూపాయలను చైతన్యకు, మరో రూ.80 వేలను బొల్లిన కృష్ణకు ఇచ్చారు. అనంతరం తన డబ్బులు ఇవ్వాలని అడగడంతో ఆయనను దుర్భాషలాడి, కొట్టి వృద్ధాశ్రమం నుంచి గెంటివేశారు. దీంతో కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయంలో కూడా కృష్ణారావు ఫిర్యాదు చేశారు. ఆశ్రమ నిర్వాహకులపై బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. అయితే పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట కృష్ణారావు